క్లుప్తంగా

హద్దులు ఏర్పాటు చేయాలి

కొంగరకలాన్‌లో యువకుడి నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్ష చేస్తున్న జనార్దన్

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లోని కొత్త చెరువును సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని ఓ యువకుడు నిరాహారదీక్షకు దిగాడు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌కు చెందిన జనార్దన్ అనే యువకుడు చౌరస్తాలో దీక్షకు పూనుకున్నాడు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశాడు. చెరువును కాపాడి పట్టణ ప్రజలకు, మత్స్యకారులకు ఉపాధి కల్పించేలా కృషి చేయాలని కోరారు. అధికారులను వినతిపత్రాలిచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

జెడ్పీటీసీ వెంకటేశ్


వెంకటేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాసులు

తలకొండపల్లి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని జెడ్పీటీసీ వెంకటేశ్ అన్నారు. గురువారం ఊరుకొండ మండలం ఊరుకొండపేట్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి బ్రహోత్సవాల్లో వెంకటేశ్ పాల్గొన్నారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం జెడ్పీటీసీకి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు


తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌లో గురువారం సీసీరోడ్డు పనులను మాజీ సర్పంచ్ శ్యాం సుందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రవణ్ కుమార్‌రెడ్డి, జంగయ్య, శివ, వెంకటేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ


సైదయ్య

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ సీఐగా సైదయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన మన్మోహన్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో యాచారం సీఐగా విధులు నిర్వహిస్తున్న సైదయ్యను అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ సైదయ్య మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదును క్షుణంగా పరిశీలించి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

యాచారం సీఐగా శంకర్



యాచారం: యాచారం సీఐగా శంకర్‌కుమార్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. యాచారంలో పనిచేస్తున్న సైదయ్య అబ్దుల్లాపూర్‌మెట్ సీఐగా బదిలీపై వెళ్లారు. శంకర్‌కుమార్ సీసీఎస్ భువనగిరి నుంచి బదిలీపై యాచారం వచ్చారు.

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ బదిలీ

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు కూడా బదిలీ అయ్యారు. సీఐ రామాంజనేయులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న నాగరాజు గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీపై వస్తున్నారు.

నేడు ఓల్డ్ గాయత్రీ నగర్‌లో వైద్య శిబిరం

మీర్‌పేట: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్‌లోని ఓల్డ్ గాయత్రీనగర్ శారదా లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ఆవరణలో ఓజోన్, నేత్రాలయ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యుడు నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

బిల్లుల ‘పంచాయితీ’

గ్రామ స్వరాజ్యమే అభివృద్ధికి నాంది. అయితే పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక సతమతమౌతుండగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో సొంత నిధులతో పనులు పూర్తి చేసిన ప్రజా ప్రతినిధులు ఇబ్బంది పడుతున్నారు. ఆదాయ వనరులు అంతగా లేని గ్రామ పంచాయతీల నిర్వహణ కత్తిమీద సాములా మారింది. నిధుల కొరత జీపీలను వేధిస్తోంది.



- పదవీకాలం ముగిసినా అందని బిల్లులు
- సతమతమవుతున్న తాజా మాజీ సర్పంచ్‌లు
- జీపీల్లో నిధులలేమితో అగచాట్లు
- గ్రామాల్లో ఆగిపోయిన అభివృద్ధి పనులు

మంచాల: దేశానికి పట్టు కొమ్మలైన గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ప్రభుత్వాలు పదే పదే హామీలు గుప్పిస్తుంటాయి. కానీ సకాలంలో గ్రామ పంచాయతీలకు నిధులు అందించడం లేదు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక ప్రజా ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీల నిర్వహణకు ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు, కేంద్ర 14వ ఆర్థిక సంవత్సర నిధులు ఇంకా విడుదల చేయలేదు. దీంతో జీపీల నిర్వహణ కష్టంగా మారింది. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో 13 గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.26 లక్షల 49వేల 487 పెండింగ్ బిల్లులు ఉన్నాయి. వాటిలో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి రూ.20 లక్షలు ఉండగా ఇతర పనులకు సంబంధించి మరో రూ.6లక్షలకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎస్ఎఫ్‌సీ నిధులెప్పుడు?

ఎస్ఎఫ్‌సీ నిధులు 11 నెలలుగా రావడం లేదు. గతేడాది నవంబర్ నెలకు సంబంధించి రూ.25లక్షల 30 వేలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.2కోట్ల 75 లక్షలు బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అందించే 14వ ఆర్థిక సంవత్సర నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు ఎప్పటికప్పుడు నిధులు అందించి గ్రామాల అభివృద్ధికి దోహదపడాల్సిన ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో అభివృద్ధి కుంటు పడుతుందని ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదవి కాలం ముగిసిన గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మాజీ సర్పంచ్‌లు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



మా గ్రామ పంచాయతీలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.7లక్షలకు పైగా రావాలి. పనులు చేసిన వెంటనే నిధులివ్వాలి. పదవి కాలం ముగిసినా.. బకాయిల కోసం పడిగాపులుకాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలి.

కొంగర విష్ణువర్ధన్‌రెడి, మాజీసర్పంచ్, ఆరుట్ల

ప్రభుత్వం మంజూరు చేస్తుంది



గ్రామ పంచాయతీలకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. కచ్చితంగా పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఆలస్యమై మాట వాస్తవమే. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేస్తారు.

– తేజ్ సింగ్ (ఎంపీఓ) మంచాల

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ప్రత్యేకాధికారి సంతోష్


పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు

తలకొండపల్లి: పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని ప్రత్యేకాధికారి సంతోష్ అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గురువారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి, వీరన్నపల్లి, కోరింతకుంటతండా గ్రామ పంచాయతీల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్యం తదితర సమస్యలను తెలుసుకున్నారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. వాటర్ లీకేజీలను అరికట్టి తాగునీటి సమస్య పరిష్కరించునున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, వెంకటయ్య, కార్యదర్శులు పరమేశ్వర్, జంగయ్య, వాసావాచారి, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ప్రత్యేకాధికారులు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో గ్రామాల్లోని పలు కాలనీల్లో రోడ్లను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. చౌదర్‌పల్లి గ్రామంలో ఎంపీడీఓ విజయలక్ష్మి స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులపై పంచాయతీ సిబ్బంది సూచనలు చేశారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్


డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని గోవిందాయిపల్లి, పల్లెచెలకతండా గ్రామ పంచాయతీల్లో ఎంపీపీ పర్యటించారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల్లో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కమ్లీమోత్యానాయక్ మాట్లాడుతూ తండాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం చరికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములుగౌడ్, మాజీ సర్పంచ్ లోక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు ఎల్లాగౌడ్ సీతారాం, నాయకులు శ్రీను నాయక్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

స్కూల్ చైర్మన్ అంబటి లక్ష్మయ్య



పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న లక్ష్మయ్య, తిరుపతి, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: విద్యార్థి జీవితం తెల్ల కాగితం లాంటిదని దేవుని పడకల్ ప్రాథమిక పాఠశాల స్కూల్ చైర్మన్ అంబటి లక్ష్మయ్య అన్నారు. అంబటి లక్ష్మయ్య, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి సొంత నిధులతో మండల పరిధిలోని దేవుని పడకల్ ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేలు విలువ గల కుర్చీలు, టేబుళ్లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉపాధ్యాయుల సూచనలు, సలహాల తీసుకొని లక్ష్యాలని ఛేదించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శంకర్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ రమేశ్, యూత్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత, హేమలత, యాదయ్యగౌడ్, సాయిరాం, మల్లేశ్, తిరుపతి, లక్ష్మయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి నిధులు పెంచాలి


ఏ.వీ. సుధాకర్

మంచాల: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధులు కేటాయించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం మంచాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ

మంచాల: మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మంచాల మండలంలోని చీదేడ్ గ్రామానికి చెందిన రామకృష్ణను నియమించారు. గురువారం రామకృష్ణకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతను నేరవేర్చుతానని తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బలిజగూడ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజేశ్


నియామక పత్రం అందజేస్తున్న రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బలిజగూడ గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాజేశ్, కార్యదర్శిగా పవన్ నియమితులయ్యారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్ నియామక పత్రాలు జారీ చేశారు. గురువారం రాజేశ్, పవన్‌కు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు బల్లెపు సతీష్‌కుమార్, పవన్, సాయి, భరత్ పాల్గొన్నారు.

సందిగ్ధంలో ‘సహకారం’

- కొత్త చైర్మన్ కోసం కసరత్తు
- త్వరలో ఎన్నిక

మంచాల: మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం సందిగ్ధంలో పడింది. 2024 జనవరి 31న సహకారం సంఘం చైర్మన్ పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ జిల్లా అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న యాదయ్యకు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. వారిలో పుల్లారెడ్డిని తొలగించడంతో 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. తిరిగి ఎన్నికలు నిర్వహించాలంటే మరొకరిని కో–ఆప్షన్ మెంబర్‌గా ఎన్నుకోవాలి. అనంతరం డీసీఓను తిరిగి చైర్మన్ ఎన్నికకు చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుంది. డీసీఓ షెడ్యూల్ ప్రకారం చైర్మన్ ఎన్నిక ప్రక్రియ తేదీని ఖరారు చేస్తారు.



మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

కాంగ్రెస్‌కే మెజార్టీ

మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో 12 మంది డైరెక్టర్లలో యాదయ్య, సత్యనారాయణ, రవి, పద్మ బీఆర్ఎస్‌కు మద్దతిస్తున్నారు. హన్మంత్‌రెడ్డి, వింజమూరి రాంరెడ్డి, వేణుగోపాల్‌రావు, వెంకటేశ్, రమేశ్, జనార్దన్‌రెడ్డి, మణెమ్మ, అరుణమ్మ కాంగ్రెస్ వైపు ఉన్నారు. దీంతో చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్‌లో కూడా ఇద్దరు ఆశావాహులు చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పాలకవర్గం గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. త్వరలోనే జిల్లా అధికారులను కలిసి మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్ ఎన్నికతో పాటు రైతుల సంక్షేమానికి నిధులు కూడా కేటాయించాలని కోరనున్నట్లు సమాచారం.

విద్యార్థులకు యూనిఫాం, షూ పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం, షూ పంపిణీ చేసిన బాలమణి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక ఎంపీటీసీ బాలమణి రూ.1లక్ష విలువ చేసే స్కూల్ యూనిఫాం, షూలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశ్‌గౌడ్, రమేశ్‌జీ, జంగయ్య, సత్తిరెడ్డి, రమేశ్, మల్లేశ్, నాగేశ్, మహేందర్, సాయి, మహేశ్, మాజీ వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్


సమావేశంలో మాట్లాడుతున్న జగన్

ఆమనగల్లు: బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని దూషించిన బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రారంభమైందని అన్నారు. రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బల్కా సుమన్, బీఆర్ఎస్‌ను ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, నాయకులు కృష్ణానాయక్, శ్రీశైలం, అబ్దుల్ ఖాదర్, అలీం, శ్రీకాంత్, నాజర్, రహీం, కరీం, ఫరీద్ పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లుగౌడ్

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మంజుల, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ రమేశ్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కోశాధికారి వెంకటయ్య, పీఆర్‌ఓ పాషా, సభ్యులు మోహన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, బాలకృష్ణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా షబ్ ఏ మెరాజ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని జామై మసీదుతో పాటు అన్ని మసీదుల్లో బుధవారం రాత్రి షబ్ ఎ మెరాజ్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పట్టణంలోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆయా మసీదుల్లో ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు నిర్వహించారు.

మల్లు రవి, వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తాం

పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి


మాట్లాడుతున్న కేశవరెడ్డి, శ్రీనివాసురెడ్డి

తలకొండపల్లి: మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపించుకుంటామని పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి మల్లు రవి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి వంశీచంద్‌రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించాలని పార్టీ అధిష్ఠానానికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేశవరెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి మల్లు రవి, చల్లా వంశీచంద్‌రెడ్డి సేవలు చాలా అవసరమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినయ్‌కుమార్‌కు బెస్ట్ మెకానిక్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వినయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న వినయ్‌కుమార్‌కు బెస్ట్ మెకానిక్ అవార్డు వచ్చినట్లు డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. గురువారం కాచిగూడ డిపోలో జరిగిన ఆర్టీసీ ప్రగతి రథ చక్రాల కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఈ అవార్డును వినయ్‌కుమార్ అందజేశారని చెప్పారు. సమయపాలన పాటిస్తూ, బాధ్యతతో విధులను నిర్వర్తించే వారిని సంస్థ తప్పక గుర్తించి ప్రొత్సాహక అవార్డులు, బహుమతులు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజినల్ మేనేజర్ ఆర్‌ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎంలు విజయభాను, సుచరిత, డిప్యూటీ ఆర్‌ఎం(మెకానికల్) జగన్ పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

కందుకూరు: కృష్ణా జలాల గురించి మాట్లాడే కనీస నైతిక అర్హతను బీఆర్ఎస్ పార్టీ కోల్పోయిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి గోదావరి ప్రాజెక్టుల నిర్మాణంలో కేసీఆర్, హరీశ్‌రావుల అవినీతి బట్టబయలై జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీన్ని పక్క తోవ పట్టించేందుకే కృష్ణా జలాలపై హంగామా సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి సబితారెడ్డి కృష్ణా జలాలపై నీటి హక్కులు కేఆర్‌ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగిస్తూ తెలంగాణకు నష్టం కలిగిస్తున్నారంటూ అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు.